క్లుప్తంగా

కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు



బాడంగి గురుకులంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

బాడంగి: ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు ముగింపు దశకు చేరుకున్నాయి. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకులం, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు వివిధ జిల్లా పరిషత్ పాఠశాలల్లో జరుగుతున్న ప్రత్యేక తరగతులు మంగళవారంతో ముగియనున్నాయని ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి, పదో తరగతి పరీక్షలు జూన్ 2వ తేదీ నుంచి నిర్వహించనున్నారు.

చురుగ్గా గ్రావెల్ రోడ్డు నిర్మాణం



సంకిలి గ్రామంలో గ్రావెల్ రోడ్డు వేయిస్తున్న సర్పంచ్ పట్టాభి

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ యాదవ వీధిలో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. 15వ ఆర్థికసంఘం నిధులతో ఈ నిర్మాణం చేపడుతున్నామని, త్వరితగతిన పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకువస్తామని సర్పంచ్ బుడుమూరు పట్టాభి తెలిపారు.

మనబడి నాడు-నేడు పనుల ప్రారంభం



కొత్తవలస పాఠశాలలో జరుగుతున్న ఫ్లోరింగ్ నిర్మాణ పనులు

రాజాం: పట్టణ పరిధిలోని కొత్తవలస యూపీ స్కూల్‌లో రెండో విడత మనబడి నాడు-నేడు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. దాదాపు రూ.10 లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నామని, ఇప్పటివరకు రూ.8 లక్షలు మంజూరయ్యాయని ప్రధానోపాధ్యాయుడు కుదమ తిరుమలరావు తెలిపారు. మూడు తరగతి గదుల్లో గ్రానైట్ ఫ్లోరింగ్ వేయడంతో పాటు అదనంగా నాలుగు మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు.

80 మందికి ఆరోగ్య తనిఖీలు



వృద్ధుని ఆరోగ్యంపై ఆరాతీస్తున్న వైద్యాధికారిణి

రాజాం సిటీ: స్థానిక కంచర వీధిలోని సత్యసాయి మందిరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖపట్నానికి చెందిన ఏవిష్ ఆస్పత్రి వైద్యులు కీళ్లనొప్పులు, థైరాయిడ్, లెగ్ అల్సర్స్ వంటి వ్యాధులతో బాధపడుతున్న 80 మందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తులు కె.బసవరాజు, వీరభద్రుడు, మల్లేష్, సాయి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ



నవధాన్యాల కిట్లతో రైతులు

రేగిడి: మండలంలోని గుళ్లపాడు గ్రామంలోని రైతులకు నవధాన్యాల కిట్లు ఆదివారం పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టర్ సీహెచ్ శారద, సర్పంచ్ వియ్యపు చక్రపాణి మాట్లాడుతూ వీటిని ఖరీఫ్ దుక్కులకు ముందే పొలాల్లో వీటిని వేసి, దుక్కి తర్వాత అలానే వదిలేయాలని తెలిపారు. దీంతో నేలకు పోషకాలు అంది, భూసారం బాగుంటుందన్నారు. ఆ తర్వాత పంటలు వేసుకుంటే ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్, ఐసీఆర్‌పీలు రమణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

బొబ్బిలి: పట్టణంలోని ఓ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 107 మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని సీఐ ఎం. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ లబ్ధి

● డిప్యూటీ సీఎం రాజన్నదొర



వలంటీర్లను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర



లబ్ధిదారునికి బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్నారని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని కుంటినవలసలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఎటువంటి అవినీతి జరగలేదని స్పష్టం చేశారు. లబ్ధిదారులు బ్యాంక్ ఖాతాలకే నేరుగా సంక్షేమ పథకాల నగదు జమైందని చెప్పారు. పేద,బడుగు,బలహీనవర్గాల ఆశాజ్యోతి జగనన్న అని కొనియాడారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు కూడా చేయలేని ఎన్నో పనులను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేశారని చెప్పారు.

వలంటీర్ సేవలు మరువలేనివి...

ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలు మరువలేనివని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని పెదమేడపల్లిలో బడేవలస, జక్కువ, మేపడపల్లి గ్రామాల వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేవా దృక్పథంతో వలంటీర్లు ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మయూర్ అప్పలనాయుడు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, లచ్చిరెడ్డి అప్పలనాయుడు, పారిపిరెడ్డి అరుణ, యాండ్రాపు సింహాచలం, ఎంపీడీఓ త్రివిక్రమ్‌తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



● ప్రగతి బాట

ఈ చిత్రంలో చూస్తున్న రోడ్డు.. పాలకొండ-రాజాం ప్రధాన రోడ్డు నుంచి రేగిడి మండలంలోని తోకలవలస గ్రామానికి కొత్తగా వేసిన బీటీ రోడ్డు. గతంలోని టీడీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు అంతా చాలా అధ్వానంగా తయారైంది. దీంతో అటువైపుగా వెళ్లే వావిలవలస, లింగాలవలస, లక్ష్మణవలస, తాటిపాడు గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడేవారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవతో దాదాపు రూ.34.10 లక్షల వ్యయంతో 2.24 కిలోమీటర్ల మేర కొత్తగా రోడ్డును నిర్మించడంతో ఆయా ప్రాంతాల రాకపోకలకు మార్గం సుగమమైంది. హాయిగా ప్రయాణిస్తున్నామని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

\- రేగిడి

చంద్రబాబుది వక్రబుద్ధి



రాజాం: మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

● ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిది వక్రబుద్ధి అని, అది రానురాను ఆయనలో కనబడుతోందని ఎమ్మెల్యే కంబాల జోగులు విమర్శించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే పక్కా ఇళ్ల కోసం ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన స్థలం సమాధులకే సరిపోతుందన్న చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇస్తుంటే కోర్టులో కేసు వేసి, దానిని అడ్డుకునేందుకు ప్రయత్నించి, ఆయన పేదల వ్యతిరేకి అయ్యారన్నారు. అమరావతిలోని పేదలకు ఇళ్లు ఇవ్వవచ్చన్న సుప్రీంకోర్టు ఆదేశాలే ఆయన అక్రమంగా పేదల ఇళ్లు అడ్డుకుంటున్నారన డానికి నిదర్శమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం, అభ్యున్నతి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని, అది చూసి ఓర్వలేకనే చంద్రబాబు అండ్ కో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును మెచ్చుకుని, పెద్దరికాన్ని నిలబెట్టుకోవాలని హితవు పలికారు. చంద్రబాబు తీరును నిరసిస్తూ స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద సోమవారం నిరసన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ నేతలు, ఇంటి పథకం లబ్ధిదారులంతా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వంగర కన్వీనర్ కరణం సుదర్శనరావు, వంజరాపు విజయ్‌కుమార్, తోట తిరుమలరావు, దూబ గోపాలం, గోకవలస బాబూరావు, పాలవలస గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



బహుమతులు పొందిన విద్యార్థినులతో నిర్వాహకులు, ఉపాధ్యాయులు

రాజాం సిటీ: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, అందరూ బాగా చదువుకోవాలని డాక్టర్ యడ్ల నీరజారాణి కోరారు. పట్టణంలోని డోలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'యడ్ల నీరజారాణి గర్ల్స్ ఎస్ఎస్‌సీ-2023 అవార్డు'కు సంబంధించి, ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 530 మార్కులు పైబడి సాధించిన విద్యార్థినులకు ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలు ఎందులోనూ తక్కువ కాదని, ప్రస్తుతం గొప్ప స్థాయిల్లో ఉన్న వారంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనన్నారు. ఓటమి గెలుపు కోసం పునాది అని భావించి, ముందుకు సాగాలన్నారు. చదువులో రాణించిన ఎంతోమంది ఉన్నత శిఖరాలు అధిరోహించారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ పరీక్షకు రాజాం, తెర్లాం, పాలకొండ, జి.సిగడాం మండలాల నుంచి దాదాపు 135 మంది విద్యార్థినులు హాజరు కాగా, రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని రేగిడి అక్షిత, కంచరాం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సైలాడ లయ, రేగిడి మండలంలోని అంబాడ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన మెరుగుల రమ్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరికి రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతి, షీల్డులు అందజేశారు. మరో 10 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. అలాగే మందరాడ, పాలకొండ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినులకు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడుడు వీవీ వసంతకుమార్, వైద్యులు ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.శరత్ కుమార్, ఎస్.సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్కమ్మ పేరంటాలకు ప్రత్యేక పూజలు

సంతకవిటి: మండలంలోని అక్కరాపల్లి గ్రామంలో అక్కమ్మ పేరంటాలుకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన యూత్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు పాల్గొని, అమ్మవారికి కుంకుమ పూజలు చేసి, అందరూ బాగుండాలని కోరుకున్నారు.

ప్రేమతో మెలగాలి



బాడంగిలో సంఘీభావ ర్యాలీ

బాడంగి: హెచ్ఐవీ సోకిన వారిపట్ల ప్రేమతో మెలగాలని సీహెచ్‌సీ ఐసీటీసీ కౌన్సిలర్ బి.భానుమూర్తి తెలిపారు. అంతర్జాతీయ కొవ్వొత్తుల సంఘీభావ దినోత్సవం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీ సిబ్బంది, చైల్డ్ ఫండ్ ఇండియా సిబ్బంది, ఐసీటీసీ కౌన్సిలర్, తదితరులు ఆదివారం మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు.

ఇద్దరి అరెస్ట్

బాడంగి: మండలంలోని డొంకినవలస సమీపంలో మద్యం తరలిస్తున్న లక్ష్మీపురం గ్రామానికి చెందిన జామి కృష్ణ, బంగారునాయుడులను ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఆర్ .జయంతి తెలిపారు. వీరి నుంచి 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, బొబ్బిలి కోర్టుకు తరలించిట్లు చెప్పారు.

సత్యసాయి సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్

రేగిడి: భగవాన్ సత్యసాయిబాబా సేవలు చిరస్మరణీయమని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక విశ్వసాయి మందిరాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రవచన కార్యక్రమం నిర్వహించి, భక్తులకు సందేశం చదివి వినిపించారు. ప్రతిఒక్కరూ సత్యసాయి సేవామార్గం అనుసరించాలని తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అని అందరూ ఒకరికొకరు సహాయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కుమార్ రాజా, రామ్మోహన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మెంటాడ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

భానుడి కర్ఫ్యూ..



నిర్మానుష్యంగా మారిన తెర్లాం ప్రధాన రోడ్డు



జన సంచారంలేని తెర్లాం ఎస్సీ కాలనీలో ఓ వీధి

వేసవి ఎండలు రోజురోజుకీ మండుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం పది గంటలకే ఎండ ఎక్కువగా కాస్తుండడంతో ఇంటి నుంచి బయటకు రావడానికే ప్రజలు భయపడుతున్నారు. ఆదివారం 42 డిగ్రీల నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. వీధుల్లో కూడా జన సంచారం లేకపోవడంతో వెలవెలబోతున్నాయి. ఓ వైపు ఎండ మరోవైపు ఉక్కబోతతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు.

\- తెర్లాం

● మా ఊరి జాతర..




కోటశిర్లాంలో అంజలి రథం కోసం నిర్ణయించే చెట్టుకు పూజలు చేసేందుకు ముర్రాటలు తీసుకెళ్తున్న మహిళా భక్తులు



కోటశిర్లాంలో అమ్మవారి ఘటాలను తిరువీధి తిప్పుతున్న భక్తులు

మండలంలోని కోటశిర్లాం, తారాపురం గ్రామాలలో పండగ వాతావరణం నెలకొంది. కోటశిర్లాంలో పైడితల్లమ్మ, కొత్తమ్మ, బంగారమ్మ తల్లి పండగలను సోమ, మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత పండగలు చేస్తుండడంతో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే గ్రామాన్ని విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. మూడు రోజులూ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. సుమారు లక్షన్నర మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని కమిటీ సభ్యులు చెబుతున్నారు. అలాగే తారాపురంలో చింతాలమ్మ తల్లి పండగను జూన్ 5,6,7 తేదీల్లో చేపట్టనున్నారు. అక్కడ కూడా 24 ఏళ్ల తర్వాత పండగలు నిర్వహించనుండడంతో కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ ఇప్పటికే ఆయా గ్రామాలకు చేరుకున్నారు. ప్రతి ఇల్లూ కుటుంబ సభ్యులు, బంధువులతో కళకళలాడుతోంది. మొత్తానికి ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

\- రామభద్రపురం



తారాపురంలో పూజలందుకుంటున్న చింతాలమ్మ



తారాపురంలో అమ్మవారి ఘటాల తిరువీధి

శిక్షణ తరగతులు విద్యార్థులకు వరం



విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ చెబుతున్న హెచ్ఎం రవిబాబు



రామభద్రపురం: పిల్లతో చదివిస్తున్న లైబ్రేరియన్ సత్యవాణి

బాడంగి: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు విద్యార్థులకు వరంగా మారాయి. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. గ్రంథాలయాధికారి ఆర్.దుర్గాప్రసాద్ బొమ్మల తయారీ, పొడుపు కథలు, నీతి కథలను చెబుతున్నారు. అలాగే కంప్యూటర్ బేసిక్స్, చిత్రలేఖనం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలపై కూడా అవగాహన కల్పిస్తున్నారు. బాడంగి, పిండ్రంగివలస హెచ్ఎంలు ఎస్. త్రినాథరావు, వై.రవికుమార్, టీచర్లు ఈశ్వరరావు, శ్రీనివాసరావు, రహీమ్, సంధ్య, తదితరులు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

ఉత్సాహంగా వేసవి తరగతులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. లైబ్రేరియన్ సత్యవాణి ఆధ్వర్యంలో వివిధ రకాల సబ్జెక్ట్‌లపై ప్రత్యేక తరగతులతో పాటు నీతి కథలు, తెలుగు పద్యాలు చెప్పిస్తున్నారు. అలాగే యోగా, చిత్రలేఖనాల్లో కూడా శిక్షణ ఇస్తున్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 77 మంది ఎంపిక

తెర్లాం: మండల కేంద్రంలోని వాసవీ కల్యాణ మంటపంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా నేత్ర వైద్యశిబిరంలో 152 మంది రోగులను పరీక్షించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం సౌజన్యంతో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన వైద్యశిబిరంలో 77 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. రోగులకు స్థానిక ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కందుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంఘ నాయకులు, సభ్యులు భోజనం, తాగునీరు సదుపాయం కల్పించారు.



శస్త్ర చికిత్సకు ఎంపికైన రోగులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

తెర్లాం: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞానశిబిరంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొంటున్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు ఆటల్లో కూడా తర్ఫీదునిచ్చారు. ప్రతిరోజూ గ్రంథాలయంలో నిర్వహించే వేసవి విజ్ఞానశిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, చదవడం, చిత్రలేఖనంతో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ, వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.



లైబ్రేరియన్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆటలాడుతున్న విద్యార్థులు